# నింగి-నేలా

చూస్తూనే వున్నాను..ఆమె కొంచెం సేపు ఆ చెట్టుకింద నిలబడింది. అక్కడ నిలుచున్న పదినిమిషాల్లో కనీసం ఐదుసార్లయినా చేతికున్న గడియారాన్ని చూసి వుంటుంది.

ఇక-ఏమనుకున్నదోయేమో అక్కడి నించి కదిలి చిన్నగా నడిచి షాపులోకి వచ్చింది.

పలకరింపుగా నవ్వాను. ఆమె సభ్యత కోసం చిరునవ్వు నవ్వి ఏదో అడగబోయింది. ఆమె అడగబోయే ప్రశ్న నాకు తెలుసు కాబట్టి నేనే అన్నాను.

"అతను ఇప్పటివరకూ ఆ చెట్టు కిందే నిలబడి మీరు రాబోయేముందు వెళ్లిపోయాడు"

"అవును వచ్చి వెళ్లిపోయాడా?" అన్నదామె వెంటనే.

"అవును"

"అయ్యో! నేనెంత చెడ్డదాన్ని" చిన్నగానే నొచ్చుకుంటున్నట్టు అన్నది. అలా అన్న తర్వాత ఆమె వెంటనే ఏమీ మాట్లాడలేదు. ఆ తర్వాత కూడా ఆమె పెదవి కదపలేదు. నిమిషం సేపు బయట రోడ్డువారగా నా షాపుముందు వున్న ఆ చెట్టుకేసి చూసి నాతో ఏమీ చెప్పకుండానే వెళ్లిపోయింది.

నాకే బాధ అనిపించింది.

వాళ్లిద్దరూ గత కొన్ని రోజులుగా నాకు తెలుసును. నా షాపు ఎదురుగా విశాలంగా కొమ్మలు పరచుకున్న ఆ చెట్టు లేకుండా వున్నట్లయితే నాకు వాళ్లిద్దరూ తెలిసే అవకాశమే లేదు.

అసలు వాళ్లిద్దరికీ పరిచయం ఆ చెట్టు కిందనే జరిగింది. తర్వాత నా కళ్ల ఎదుటే ఆ పరిచయం స్నేహంగా ఇప్పుడు ప్రేమగా మారింది.

అతను బాగా అందంగా వుంటాడు. ఎదుటి మనుషులను చాలా సులభంగా ఆకట్టుకునే ఆకర్షణ అతనిలో బాగా వున్నది. అతను ఎదుటి మనుషులతో నవ్వుతూ సంభాషణ జరుపుతాడు..అతని చిరునవ్వు ఎవరినైనా సమ్మోహపరచగలదు.

మొదటిసారి అతను షాపులోకి వచ్చి ఏదో కావాలని అడిగినప్పుడు అతని పేరు నాకు తెలీదు. నిజానికి ఎప్పుడో ఒకసారి ఏదో కొనడానికి వచ్చిన మనుషుల పేర్లు తెలుసుకోవలసిన అవసరం ఏమున్నది గనుక..కాని అతను ఆ తర్వాత రెండురోజులకే మళ్లీ వచ్చి తనని పరిచయం చేసుకున్నారు.

అతని పేరు శ్యామలరావు. ఏదో కమర్షియల్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నారు. ఇంకా పెళ్లి కాలేదు. అతను నా గురించి, నా షాపు గురించి కొంచెంసేపు ఏవో ప్రశ్నలు వేశాడు. అతను నాతో మాట్లాడుతూ వున్నప్పుడు ఆమె ఆ చెట్టు దగ్గరకు వచ్చి నిలబడింది. అతను వెంటనే మళ్లీ కలుస్తానని చెప్పి ఆ చెట్టుకిందికి వెళ్లిపోయాడు.

చూస్తూనే వున్నాను. అతను ఆమెతో మాట్లాడుతున్నాడు. ఆమె సిగ్గుపడుతోంది. అతను నవ్వుతూ ఆమె కళ్లలోకి చూసి సంభాషణ జరిపాడు. ఆ తర్వాత కొంచెం సేపటికి ఆమె వెళ్లిపోయింది. అతను కూడా వెళ్లిపోయాడు.

ఆరోజు నుంచి వాళ్లిద్దరూ ఎవరు ముందుగా వచ్చినా ఆ చెట్టుకింద నిలబడేవారు. ఎక్కువగా అతనే రోజూ ముందుగా వచ్చి ఆ చెట్టుకింద నిలబడేవాడు. ఒకవేళ ఎప్పుడైనా ఆమె రావటం ఆలస్యమయితే తను బోరు ఫీలయితే నా దగ్గరకు వచ్చి ఏదో మాట్లాడేవాడు.

ఒకరోజు అడిగాడు "మీకు ఈ షాపు గిట్టుబాటుగా వుందా?"

అతను అలా ఎందుకు అడిగాడో నాకు తెలుసు. నా ఫ్యాన్సీ షాపు వున్నది సెంటర్లో కాదు. ఎక్కువ బిజినెస్సు కూడా వుండదు. అప్పుడప్పుడు కొంచెం దూరంగా కాలనీలో వుంటున్నవాళ్లు వచ్చి బేరాలు చేస్తూ వుంటారు.

"డిగ్రీ వుంది కదా ఉద్యోగం చెయ్యకూడదూ?" మళ్లీ అడిగాడు అతను అదేరోజు.

ఒకరిద్దరి దగ్గర పని చెయ్యటం నాకు ఇష్టం లేదని చెప్పాను. నిజానికి అంత అవసరం కూడా లేదు నాకు. అంతో ఇంతో సంపద వుంది. ఈ షాపు మీదనే నా ఖర్చులు మినహాయించిన తర్వాత మూడొందల రూపాయలవరకూ ప్రతినెలా నాకు మిగులుతూనే ఉన్నది.

ఈ విషయమే అతనితో అంటే ఆశ్చర్యపోయేడు. తన దగ్గర మనీ లేదని వుంటే ఉద్యోగం మానేసి బిజినెస్ పెట్టే వాడిననీ అన్నాడు.

బహుశ అతను ఆమెకు నా గురించి చెప్పి వుండాలి. ఎందుకంటే ఒకరోజు ఆమె అతనికంటే ముందుగా వచ్చింది. వచ్చి ఆ చెట్టుకింద ఓ పావుగంటకు పైగానే నిల్చున్నది.

తర్వాత నా దగ్గరకు వచ్చింది.

పలకరింపుగా నవ్వి "అతను రాలేదా?" అని అడిగింది.

"ఇంకా లేదు" చెప్పాను.

తర్వాత ఆమె హేర్ పిన్నులను, క్లిప్పులను కొన్నది. డబ్బులు ఇస్తూ అడిగిందామె.

"మీరు బియ్యే పాసయినారట గదా"

తల వూపాను.

"హాయైన ఉద్యోగం.." అన్నది తరవాత.

ఇంతలోనే అతను వచ్చాడు. ఆమె వెళ్లిపోయింది.

దగ్గరనించి ఆమె అందాన్ని చూశాను.

విశాలంగా ఉన్న కళ్లు, పలుచని పెదవులు, గుండ్రటి ఎర్రటి బొట్టు పెట్టుకున్నది.

ఇద్దరూ మంచి జంట అనుకున్నాను.

వాళ్లిద్దరూ రోజూ నా షాపుముందు వున్న ఆ చెట్టుకింద కలుసుకుని మాట్లాడుకోవటం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. ఎందుకంటే వాళ్లిద్దరినీ చూస్తూ కూర్చోవటం నాకూ కొంత కాలక్షేపంగా వుంటుంది. అంతేకాదు..ఆమె అందాన్ని ఆమె మాట్లాడుతున్నప్పుడు అతని మాటలు వింటున్నప్పుడు ఆమె ముఖంలో మారే ఫీలింగ్సనూ, ఆమె కదలికలనూ చూస్తుండవొచ్చు.

అయితే వున్నట్టుండి నా ఈ కాలక్షేపానికి అంతరాయం కలిగింది. ఒకరోజు సాయంత్రం అతనొచ్చి చెప్పాడు.

"నేను రేపు ట్రెయినింగుకి బెంగుళూరు వెళుతున్నాను..నెలరోజుల దాకా తిరిగి రాను."

ఆరోజు ఆ చెట్టుకింద వాళ్లిద్దరూ చాలాసేపు నిలబడి మాట్లాడుకున్నారు. ఆమె మొహంనిండా విచారం అలముకున్నది. ఎంతో సేపటి తర్వాత ఇద్దరూ విడిపోయారు.

ఇక ఆ మరురోజునించి నాకు ఆ చెట్టువైపు చూస్తే దిగులుగా అనిపించింది.

దాదాపు పదిహేనురోజుల తర్వాత ఉన్నట్టుండి సాయంత్రం వేళ ఆమె నా షాపులోకి వచ్చింది. మామూలుగానే పలకరింపుగా నవ్వాను.

ఆమె కూడా నవ్వి "టూత్ బ్రష్‌లు చూపించండి" అన్నది.

ఇస్తూ అడిగాను. "ఇటువైపు అస్సలు రావటం లేదేం మీరు?"

"భలేవారే..అతను లేకుండా నాకు ఇక్కడేం పని? అతను ట్రెయినింగ్ నించి వచ్చిన తర్వాతనే మళ్లీ ఇక్కడకు రావటం. అతనికోసం తప్ప నేనొచ్చి ఆ చెట్టుకింద నిలుచోటం దేనికి?" అన్నది. ఆ చెట్టువైపు చూస్తూ ఆమె...

ఆ మాటలను బట్టి అతను ఆమె హృదయంలో ఎంతగా నిండివున్నదీ గ్రహించగలిగాను.

నెలరోజులు గడిచాయి. అతను ట్రెయినింగ్‌నించి తిరిగివచ్చాడు. మళ్లీ ఆ రోజునించే ఆ చెట్టుకింద ఇద్దరూ కలుసుకోవటం మొదలుపెట్టారు. అయితే వాళ్ల కలయికకు మళ్లీ వున్నట్టుండి అంతరాయం కలిగింది.

ఆమె తల్లికి ఒంట్లో బావుండలేదనీ, సీరియస్‌గా వుందనీ ఉత్తరం వచ్చిందట. అందుకని ఆమె పదిహేను రోజులు సెలవుపెట్టి వెళ్లిపోయింది.

మళ్లీ నన్ను నిరుత్సాహం క్రమ్ముకున్నది.

ఆమె వెళ్లిపోయిన రోజు, ఆ తర్వాత రోజు అతను ఆ చెట్టుకిందకు రాలేదు. ఆమె తిరిగి వచ్చేవరకు అతను అక్కడకు రాడని అనుకున్నాను.

కానీ–

మూడో రోజునే అతను ఆ చెట్టుదగ్గరకు వచ్చి నిలుచుని తర్వాత నా దగ్గరకు వచ్చాడు.

"ఆమె ఇంకో పన్నెండు రోజుల వరకూ రాదు కదా...మీరు మళ్లీ ఇక్కడకు వచ్చారేం.? ఏదయినా పని వుందా?" అని అడిగాను.

నా మాటలకు అతను నవ్వి "పనా? అలాంటిదేం లేదు..ఆమె కోసమే ఈ చెట్టు దగ్గరకు రావాలా? ఈ పదిహేను రోజులు బోర్‌కొట్టి చావాలనా మీ ఉద్దేశ్యం..ఒక అమ్మాయి ఈ రోజు సాయంత్రం ఈ చెట్టు దగ్గరే కలుస్తానన్నది. అందుకే వొచ్చాను" అన్నాడు.

సరిగ్గా అప్పుడే ఒక అమ్మాయి చెట్టు దగ్గరకు వచ్చింది.

"అదిగో..మాటలోనే వచ్చింది" అని అతను నవ్వుకుంటూ వెళ్లిపోయాడు.

నిజంగా నా ఆశ్చర్యానికి అంతులేదు.

ఆరోజు టూత్‌బ్రష్‌లు చూపిస్తూ నేనడిగిన ప్రశ్నకు ఆమె జవాబు గుర్తుకొచ్చింది. 'అతనికోసం తప్ప నేనొచ్చి ఆ చెట్టుకింద నిలుచోటం దేనికి?'

వాళ్లిద్దరూ ప్రేమికులు.

కానీ ఆమెకి అతనికీ మధ్య ఎంత దూరం?

*(యువ మాసపత్రిక)*